క్లుప్తంగా

బందరులో వరలక్ష్మీవ్రతం శోభ



మచిలీపట్నంటౌన్: నగరం వరలక్ష్మీ వ్రతం శోభను సంతరించుకుంది. శ్రావణ మాసంలో అత్యంత ప్రాధాన్యత శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో అమ్మవారికి పూజలు నిర్వహించేందుకు మహిళలు సన్నద్ధమయ్యారు. పూజకు అవసరమైన పలు రకాల పూలు, పళ్లు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు గురువారం వారంతా నగరంలోని కోనేరు సెంటర్‌కు చేరుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున తరలిరావడంతో కోనేరు సెంటర్ ప్రాంతంలోని ప్రధాన రహదారి కిక్కిరిసింది.

స్వామిత్వ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి



గూడూరు: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన స్వామిత్వ సర్వేను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని కప్పలదొడ్డి సర్పంచి యక్కల మాధవి కోరారు. స్వామిత్వ సర్వేపై స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సభ జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన సర్పంచి మాధవి మాట్లాడుతూ.. గ్రామంలోని పట్టా భూములు, ఇళ్లు, గ్రామకంఠం భూములు, రోడ్లు, పోరంబోకు స్థలాలను పకడ్బందీగా సర్వే చేయాలని కోరారు. వివాదాలకు తావివ్వకుండా, పక్షపాతం లేకుండా సర్వే నిర్వహించడం ద్వారా గ్రామంలో సరిహద్దు సమస్యలు లేకుండా చూడొచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం



చల్లపల్లి: నిత్యం వ్యాయామం చేయడం ద్వారా చక్కని శరీర సౌష్టవంతోపాటు ఆరోగ్యంగా ఉండొచ్చని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ పార్కులో దాతల సహాయంతో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. తొలుత తెలుగు మాగాణి సమారాధన స్తూపం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చల్లపల్లి గ్రామ అభివృద్ధికి, సదుపాయాల కల్పనకు దాతల పాత్ర ఎనలేనిదని బుద్ధప్రసాద్ కొనియాడారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డి.ఆర్.కె. ప్రసాద్, టి.పద్మావతి, స్వచ్ఛ కార్యకర్తలు చేస్తున్న కృషి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కె.ఈశ్వరరావు, చల్లపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముమ్మనేని రాజకుమార్ (నాని), డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సర్పంచ్ పి.కృష్ణకుమారి పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళులు



మచిలీపట్నంటౌన్: భారత జాతీయ గీతం జనగణమన రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఠాగూర్ చిత్రపటానికి సంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథాలయాధికారి బీరం వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ బి.విజయకుమార్, కార్యాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా స్థానిక పుస్తక విభాగంలో ఠాగూర్ రచనల పుస్తకాల ప్రదర్శనను రిఫరెన్స్ విద్యార్థులు తిలకించారు.

వాటర్ ప్లాంట్ మరమ్మతులకు రూ.30 వేల ఆర్థిక సాయం



బంటుమిల్లి: మండలంలోని పెదతుమ్మిడి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతులకు గురైంది. దీని మరమ్మతులకు పూర్వ విద్యార్థి సైకం జగన్మోహన్‌రావు రూ.30 వేల విరాళాన్ని ప్రిన్స్‌పాల్ డాక్టర్ పి.టి.జి.శ్రీనివాసాచార్యులకు గురువారం అందజేశారు. సైకం జగన్మోహన్‌రావు ఈ పాఠశాలలో 1968 నుంచి 1972 వరకు చదువుకున్నారు. తహసీల్దార్‌గా ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులు దాత జగన్మోహనరావును ఘనంగా సత్కరించారు.

మోసాల బాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

ఘంటసాల: మోసాల చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఘంటసాల డీజీఎం కాంప్లెక్స్‌లో బాబూ ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంపై మండలంలోని వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలతో గురువారం సాయంత్రం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలుచేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు కొత్త పింఛన్లు రాక, రైతులు గిట్టుబాటు ధర దక్కక, సాగునీరు లేక, యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ, రాష్ట్రాభివృద్ధికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే రాష్ట్రం మరో శ్రీలంక అవుతోంది, పేదలకు దోచిపెడుతున్నారని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి నేతలు గగ్గోలు పెట్టారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు అమలు చేయకుండానే రూ. లక్షల కోట్లు అప్పులు చేస్తూ ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. రైతులు, చేనేతలు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలను నమ్మించి నట్టేట ముంచిన మోసాల చంద్రబాబుకు ప్రజలు బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని రమేష్ బాబు స్పష్టం చేశారు. బాబూ ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి కూటమి పాలన వైఫల్యాలను ఎండగట్టాలని రమేష్‌బాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ, తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు, పార్టీ నాయకులు వేమూరి ప్రవీణ్, కుంపటి నాగేంద్రబాబు, మాడెం నాగరాజు, దోనె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారూ.. చేనేత మంత్రిని మేల్కొలపాలి

చేనేత జాతీయ దినోత్సవంలో టీడీపీ చేనేత విభాగం నాయకుల ఆవేదన



చేనేత జాతీయ దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: 'ఎమ్మెల్యే గారూ.. చేనేత శాఖ మంత్రి నిద్రావస్థలో ఉన్నారో ఏమో? ఒకసారి మేల్కొలిపి నిధులు వచ్చేలా చూడాలి..' అంటూ టీడీపీ సీనియర్ నాయకుడు కట్టా హేమసుందరమూర్తి ఆవేదన వ్యక్తంచేశారు. చేనేత జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పోలవరపుపేటలోని కల్యాణ మండపంలో జరిగిన సభలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఈ సభలో హేమసుందరమూర్తి మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి త్రిఫ్ట్ ఫండ్ బకాయిలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. యారన్ సబ్సిడీ, రిబేట్ వంటివి నేత కార్మికులకు రావడం లేదని, ఫలితంగా చేనేత కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అనంతరం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. చేనేత రంగం దేశ అద్భుతమైన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నమని పేర్కొన్నారు. చేనేత పరిశ్రమ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, భట్టు శివశంకర్, వాసు, చేనేత జౌళి సహాయ సంచాలకుడు సీహెచ్ సాయి ప్రసాద్, తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి వివిధ చేనేత సంఘాల అధ్యక్షులు, మేనేజర్లు, కార్మికులు పాల్గొన్నారు. చేనేత జాతీయ దినోత్సవం సందర్భంగా చేనేత వస్త్రాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు.

2,200 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



ఉల్లాస్‌పై అధికారులతో సమీక్షిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శివప్రసాద్

పెడన: మండలంలో నిరక్షరాస్యులుగా ఉన్న 2,200 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఈ ఏడాది లక్ష్యంగా నిర్దేశించి ప్రణాళికలను అమలు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.శివప్రసాద్ అన్నారు. తన చాంబరులో వివిధ శాఖలకు చెందిన అధికారులతో ఉల్లాస్ (నవభారత సాక్షరత) కార్యక్రమంపై ఆయన గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వెలుగు సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఈఓ-1 సలోమి, ఎంఈఓ-2 హరనాథ్, వెలుగు ఏపీఓ శ్రీదేవి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ వజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశ్రమలతో ఆర్థికంగా ఎదుగుదల

సూక్ష్మ పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాడానికి ప్రభుత్వం ఎన్నో రాయితీలను అందజేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ ఆర్. వెంకట్రావు అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశం హాలులో ఎంఎస్ఎంఈపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.శివప్రసాద్, డెప్యూటీ ఎంపీడీఓ ఎం.నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ డీ వర్మింగ్ పోస్టర్ ఆవిష్కరణ



ఉపాధ్యాయులకు డీ వర్మింగ్ మాత్రలు అందిస్తున్న డాక్టర్ ప్రమోద్ కుమార్, ఎంపీడీఓ సుబ్బారావు

ఘంటసాల: నేషనల్ డీ వర్మింగ్ డేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ డి.సుబ్బారావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో నేషనల్ డీ వర్మింగ్ డే అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఘంటసాల పీహెచ్‌సీ డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీన జరిగే నేషనల్ డీ వర్మింగ్ డేను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను, అధికారులను కోరారు. అనంతరం నేషనల్ డీ వర్మింగ్ పోస్టర్‌ను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎండీ మోమిన్, పీహెచ్‌సీల డాక్టర్లు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణే ప్రభుత్వ లక్ష్యం

గూడూరు: చిన్నారుల ఆనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగుల నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని గూడూరు ఎంఈఓ-2 పి.సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ నెల 12వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కంచుకుని గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల వారీగా నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. మల్లవోలు పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ వీరయ్య, సీహెచ్ఓ డాలీ సుకన్య, అనంత లక్ష్మి, మౌనిక నైటింగేల్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్కులో నూతన జిమ్‌ల ప్రారంభం



మహిళ జిమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కమిషనర్ బాపిరాజు తదితరులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ప్రధాన రహదారిలో ఉన్న మాకర్ల వెంకటస్వామి నాయుడు నగర పాలక సంస్థ ప్రధాన పార్కులో ఏర్పాటు చేసిన జిమ్‌లను, ఇతర అభివృద్ధి పనులను మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వి.వి.ఎస్.బాపిరాజు, దివీస్ లేబోలెటరీస్ ప్రతినిధి దోరెడ్ల హేమ ప్రకాష్ గురువారం ప్రారంభించారు. దివిస్ లేబొరేటరీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దివి మురళీకృష్ణప్రసాద్ ఆర్థిక సాయంతో పార్కులో ఈ మహిళా జిమ్, పిల్లల ఆటల జిమ్, ఔటర్ వాకింగ్ ట్రాక్, అంతర్గత వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్కు సూపరింటెండెంట్ రంగబాబుపాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



బంటుమిల్లి: స్థానిక శ్రీ పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా నిర్వహించిన పవిత్రోత్సవాలు గురువారం ముగిశాయి. వేద పండితుడు ముక్తేవి సత్యన్నారాయణాచార్యులు శిష్య బృందం వేద మంత్రాల మధ్య హోమాలకు పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు ఎస్.రాజ, జె.వాసుదేవరావు, యు.పి. ఆర్.విఠల్, కె.శ్రీనివాసరావు, సీహెచ్.రాధాకృష్ణ, కె.కరుణకుమార్, జె.శరభయ్యగుప్తా పాల్గొన్నారు.

కవచకుండలాలతో శ్రీమన్నారాయణుడి దర్శనం



కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గోద, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణుడి గురువారం కవచకుండలాలతో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో గర్భాలయంలోని 11 అడుగుల ఏకశిలా శ్రీమన్నారాయణ స్వామి మూలమూర్తికి విశేష అలంకారం చేశారు. ఏవిధమైన పూలమాలలు లేకుండా కవచకుండలాలతో స్వామి నిజరూప దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించారు.

వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకే తనిఖీలు

ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి



పెడన: తమ కార్యాలయానికి అందిన ఫిర్యాదులపైనే కాకుండా వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేస్తున్నామని ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్.విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం పెడన పట్టణంలోని ఎంపీపీ(బంగ్లా స్కూలు), మండలంలోని బల్లిపర్రు ఎంపీపీ, అంబేడ్కర్ గురుకుల పాఠశాలలను సందర్శించారు. బంగ్లాస్కూలులో మధ్యాహ్న భోజనం రుచి చూశారు. రికార్డులను పరిశీలించి అంతా బాగుందని మెచ్చుకుని హెచ్ఎం జి.భాగ్యలక్ష్మిని సత్కరించారు. బల్లిపర్రు ఎంపీపీ పాఠశాలలో అన్నం మెతుకులు బాగా పలుకుగా ఉండటం ఏమిటని వంట ఏజెన్సీ వారిని ప్రశ్నించారు. అంబేడ్కర్ గురుకుల పాఠశాల వద్ద ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ రూతమ్మతో మాట్లాడుతూ తప్పుడు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పట్టించుకోవద్దని, అల్పాహారం కింద ఉప్మా బాగోవడం లేదని విద్యార్థినులు అంటున్నారని, దానికి బదులుగా ఎగ్‌ఫ్రైడ్ రైస్ పెట్టాలని సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. డీఎస్ఓ శోభన్‌బాబు, మచిలీపట్నం డీవైఈఓ శేఖర్ సింగ్, పెడన ఎంఈఓ-1, 2లు సలోమి, హారనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **దేవాంగ సంక్షేమ భవనం నిర్మించాలని వినతి**

గూడూరు: స్థానిక కప్పలదొడ్డిలోని నెహ్రూ వీవర్స్ కాలనీలో ఉన్న వీవర్స్ కమ్యూనిటీ స్థలంలో దేవాంగ సంక్షేమ భవనం నిర్మించాలని దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం పెడనలో జరిగిన చేనేత దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘ అధ్యక్షుడు ములకల శ్యామలరావు, కార్యదర్శి మేడక విశ్వేశ్వరరావు పాల్గొన్నారు

- **10న రామలింగేశ్వరుడికి జాజులతో మహార్చన**

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలోని స్వామికి ఈ నెల పదో తేదీన 25 కిలోల సన్నజాజి, విరజాజి పూలతో మహార్చన జరుగుతుందని మండపం నిర్వహణ కమిటీ ప్రతినిధి ఉప్పల లీలాకృష్ణప్రసాద్, అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు స్వయంగా స్వామికి పూలతో అభిషేకం చేసే అవకాశం కల్పించామని వివరించారు.

- **ముగిసిన తల్లిపాల వారోత్సవాలు**

అవనిగడ్డ: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీడీపీఓ శేషకుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీని నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని, ప్రతి తల్లి ఏడాది వరకు తల్లిపాలనే బిడ్డలకు ఇవ్వాలని సూచించారు. అనంతరం తల్లిపాల విశిష్టతను వివరిస్తూ నినాదాలు చేశారు. సూపర్ వైజర్ రత్నమాల, ఏరియా కార్యదర్శి నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

- **ముర్రుపాలతో చిన్నారులకు నిరోధక శక్తి**

ఘంటసాల: అప్పుడే పుట్టిన చిన్నారులకు తల్లి ముర్రుపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి సమకూరుతుందని ఘంటసాల సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ అన్నారు. నందం బజార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఐసీడీఎస్ ఘంటసాల సెక్టార్ సూపర్ వైజర్ టి.రమానాగమణి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త కె.కృష్ణవేణి, ఏఎన్ఎంలు డి.రాణి, జయలక్ష్మి పాల్గొన్నారు.

- **పకడ్బందిగా ఫార్మేటివ్ పరీక్షలు**

పెడన: పాఠశాలల్లో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఫార్మేటివ్ పరీక్షలను పకడ్బందిగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంఈఓ-1 సలోమి సూచించారు. స్థానిక బంగ్లాస్కూలులోని ఎంఈఓ కార్యాలయంలో మండలంలోని హెచ్ఎంలతో సమీక్ష సమావేశం జరిగింది. ఎంఈఓ-1 సలోమీ, ఎంఈఓ-2 హరనాథ్ ప్రభుత్వ పాఠశాలలో అమలు అవుతున్న వివిధ పథకాలు, కార్యక్రమాలపై ప్రధానోపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం సలోమిని ఉపాధ్యాయులు సత్కరించారు.

- **స్వామినాథన్‌కు ఘన నివాళి**

బంటుమిల్లి: హరిత విప్లవ పితామహుడు ప్రొఫెసర్ స్వామినాథన్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఎం, రైతు సంఘ నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, సుజ్ఞానం జనార్దన్‌రావు,పుప్పాల నరసింహారావు, కొల్లా విశ్వనాథం, బొడ్డు నాగరాజు పాల్గొన్నారు.

- **ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు**

పెడన: మండల పరిధిలోని జాతీయ రహదారిపై గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. బంటుమిల్లి మండలం ముంజులూరుకు చెందిన తోట సతీష్(26), పెడన మండలం నందమూరుకు చెందిన వీరంకి పాండురంగారావు(70) ఈ ప్రమాదంలో గాయపడ్డారు. వారిని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పాండురంగారావు పరిస్థితి విషమంగా ఉందని పెడన పోలీసులు తెలిపారు.

- **సిబ్బందికి ఎస్పీ అభినందనలు**

కోనేరుసెంటర్: కృష్ణాజిల్లా ఏఆర్ విభాగంలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తూ హెడ్‌కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి పొందిన సిబ్బందిని ఎస్పీ ఆర్.గంగాధరరావు గురువారం అభినందించారు. ఏఆర్ విభాగంలో పనిచేస్తూ ఉద్యోగోన్నతి పొందిన కె.నాగరాజు, జె.ఎస్.ఆర్. ప్రసాద్ మర్యాదపూర్వకంగా ఎస్పీని కలిశారు. దీంతో ఎస్పీ వారిని అభినందించి విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని, సర్వీసులో ఎలాంటి మచ్చ లేకుండా ఉండాలని సూచించారు.

ఎరువుల కోసం రైతుల అగచాట్లు



మల్లవోలు పీఏసీఎస్‌లో ఎరువుల కోసం ఎగబడుతున్న రైతులు

గూడూరు: ఖరీఫ్ ప్రారంభం నుంచి మండలంలోని రైతులు ఎరువుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కట్ట దొరకటం కష్టంగా మారింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో యూరియా కట్ట ధర రూ.350 నుంచి రూ.400 వరకు పలుకుతోంది. సొసైటీలో మాత్రం రూ.266. బుధవారం మల్లవోలు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి 20 టన్నుల యూరియా లోడు వచ్చింది. ఈ సమాచారంతో రైతులు మల్లవోలు పీఏసీఎస్ వద్ద ఆధార్ కార్డులతో బారులు తీరారు. వచ్చింది 450 బస్తాలు మాత్రమే కావడంతో తమకు అందుతాయో లేదోనన్న రైతు ఆందోళన తోపులాటకు దారితీసింది. పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కబెట్టారు. బందరు డివిజన్‌లో పెద్ద గ్రామమైన మల్లవోలులో ఆరు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా ఖరీఫ్ సీజన్లో మల్లవోలు పీఏసీఎస్ ద్వారా ఎనిమిది లారీల యూరియా విక్రయం జరిగేది. ఎరువుల దుకాణాల ద్వారా కూడా యూరియా విక్రయాలు జరిగేవి. మల్లవోలు పీఏసీఎస్‌కు ఇప్పటి వరకు కేవలం మూడు లారీల లోడు మాత్రమే వచ్చింది. ప్రభుత్వం స్పందించి యూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

పసుపు, అరటి సాగుపై రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖాధికారి జ్యోతి

నడకుదురు(చల్లపల్లి): ఉద్యానశాఖ ఆధ్వర్యంలో చల్లపల్లి మండలం నడకుదురు పంచాయతీ కార్యాలయంలో పసుపు, అరటి సాగుపై రైతులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గుంటూరులోని ప్రాంతీయ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ తనూజప్రియ, డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ క్రాంతిరేఖ మాట్లాడుతూ.. పసుపు సాగులో కీలక అంశాలను వివరించారు. నీటి, ఎరువుల నిర్వహణ, పంటల సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రైతులకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. పసుపు పంటకు బీమా ప్రీమియం చెల్లింపు గడువు ఈ నెల 14వ తేదీ వరకే ఉందన్నారు. ఆ లోపే రైతులు ప్రీమియం చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి జె.కీర్తి, నడకుదురు రైతులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత



రవిబాబు సతీమణికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: హోంగార్డు ఎల్.రవిబాబు అకాల మరణం హోంగార్డు విభాగానికి తీరని లోటని ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. బంటుమిల్లిలోని ఓఎన్‌జీసీలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఈ యేడాది జూన్ ఐదో తేదీన రవిబాబు మరణించారు. జిల్లాలోని హోంగార్డులంతా కలిసి సేకరించిన ఒక రోజు వేతనం రూ.3,79,140 కాంట్రిబ్యూషన్ చెక్కును గురువారం మృతుడి సతీమణికి ఎస్పీ గంగాధరరావు అందజేశారు.

నిబంధనలు పాటించకపోతే లైసెన్స్ రద్దు



వాహనాలను తనిఖీచేస్తున్న ఎస్ఐ చాణక్య

కోడూరు: ఆటోవాలాలు నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే లైసెన్స్ రద్దు చేస్తామని ఎస్ఐ చాణక్య హెచ్చరించారు. గురువారం కృష్ణాపురం సమీపంలో ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. వ్యవసాయ పనులు నేపథ్యంలో ఆటోవాలాలు కూలీలను పరిమితికి మించి వాహనంలో ఎక్కిస్తున్నారని, ఇది నేరమని స్పష్టంచేవారు. నిబంధనల మేరకే కూలీలను ఎక్కించుకోవాలని సూచించారు. మైనర్లు ద్విచక్రవాహనాలు, ఆటోలు నడిపితే చర్యలు తప్పవన్నారు. ట్రైనీ ఎస్ఐ దివ్యప్రకాష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.